క్లుప్తంగా

సంజయ్ గాంధీకి నివాళి

మండపేట: కాంగ్రెస్ పార్టీ నేత సంజయ్‌గాంధీ 44వ వర్ధంతిని ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానిక ఏడిద రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సంజయ్ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, కొడవళ్ల వెంకట సుబ్బారావు, కుచ్చు బాబి, వల్లభదాసు చిన్న, కొండ దుర్గారావు, కాకి సూరిబాబు, అందుకూరి సాయి, గోమాడ శ్రీనివాస్, కొండ సతీష్, ఏ సత్య నారాయణ, అర్ రాయుడు, తమ్మిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: గ్రామాలలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నందున అపారిశుద్ధ్య వాతావరణం తలెత్తితే డయేరియా వ్యాధి వ్యాపించేందుకు అవకాశం ఉందని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. ఆదివారం మండలంలోని ఆర్యావటం, జగన్నాథగిరి, పెనుమళ్ళ, తనుమళ్ళ, అయితపూడి, తర్లంపూడి మొగలిపాలెం, శలపాక, మంజేరు తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా పర్యటించి డయేరియా వ్యాధిపై సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా జ్వరం, వాంతులు, విరేచనాలకు గురైతే డయేరియాగా గుర్తించి తక్షణమే చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదించాలన్నారు. డయేరియా వ్యాధి సోకు విధానాలపైనా, తీసుకోవలసిన జాగ్రత్తల పైన ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఐ.రత్నరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, వై.సోమినాయుడు, నరాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబీకులకు ఆర్థిక సాయం



సుదర్శనరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కాజులూరు: మండలంలోని చేదువాడలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శనరావు కుటుంబీకులకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యూజేఎఫ్) ఆర్థిక సహకారం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు సుదర్శనరావు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల చెక్కు రూపంలో అందజేశారు. సుమారు 28 ఏళ్లుగా పత్రికారంగం ద్వారా ఆయన సమాజానికి చేసిన సేవలను సంఘ నాయకులు కొనియాడారు. కుటుంబానికి సంఘ సభ్యులు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

పోరాట మార్గాన్ని చూపిన నేత గాంధీ



అంగర మార్కెట్ స్కూల్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: ప్రపంచానికి శాంతి అనే ఆయుధంతో పోరాట మార్గాన్ని చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ అని వాసవీ క్లబ్ నాయకుడు, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని అంగర మార్కెట్ స్కూల్‌లో వాసవీ క్లబ్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆదివారం నేతలు ఆవిష్కరించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వాసవీ క్లబ్, వనితా క్లబ్ నాయకులు మాట్లాడుతూ విద్యా క్షేత్రంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వారిలో చైతన్యానికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, వాసవి, వనితా క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రామ ఏకాహం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన కోదండ రామాలయం ఆలయ 36 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీరామ ఏకాహం ఆదివారం ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఏకాహంలో గ్రామానికి చెందిన మోటుపల్లి సత్తిబాబు, అమృత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శనివారం రాత్రి ఏకాహం సందర్భంగా నిర్వహించిన పవళింపు సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భజన బృందాలు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆదిమూలం వారిపాలెంలో వేంచేసిన కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖరీదైన ఖరీఫ్ సాగు

- పెట్టుబడులు కొండంత–దిగుబడులు గోరంత
- ఏటేటా పెరుగుతున్న ఖర్చులు
- కర్షకుల ఆవేదన



తొలకరి నారుమడికి విత్తనాలు జల్లుతున్న రైతు

రామచంద్రపురం: ఖరీఫ్ సాగు ఖర్చులను తలుచుకుని వరి సాగు చేసే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏ యేటికాయేడు సాగు ఖర్చులు పెరగడమే ఇందుకు కారణం. గతంలో రైతులు ఒకరికొకరు పొలం పనుల్లో సాయం చేసుకునే వారు. నేడా పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. అంతా డబ్బుమయమై పోయింది. దీంతో పొలంలో పనులకని అప్పుకోసం రైతులు పరుగులు తీస్తున్నారు. గతంతో పోల్చుకుంటే సాగు ఖర్చులు చాలా ఎక్కువయ్యాయి. అందుకు తగ్గట్టుగా దిగుబడులు కూడా లేవు. పైగా పంట ఇంటికి వచ్చే వరకు బెంగే. దీంతో వరి సాగును వదులుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ వేరే ప్రత్యామ్నాయం లేక మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మరోసారి రైతులు తొలకరికి సిద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకంగా ద్వారా వేస్తున్న డబ్బులు అంతంత మాత్రంగానే ఆదుకుంటున్నాయని రైతులు అంటున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు మండలంలో 18078 ఎకరాలు, కె.గంగవరం మండలంలో సుమారు 20 వేలు, రామచంద్రపురం మండలంలో 18 వేలు ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. మూడు మండలాల్లో సుమారుగా 18 వేల మంది కౌలు రైతులే ఉన్నారు. గత మూడేళ్లుగా ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పెట్టుబడి అయ్యేది. కానీ ఇప్పుడు, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు పెరగడం వల్ల రూ. 25 నుంచి రూ.27 వేల వరకు పెట్టుబడికే ఖర్చు అవుతుంది. తీరా ఇంత ఖర్చు చేసి సాగు చేసినా ప్రకృతి వైపరీత్యాల వల్ల కౌలు రైతులు నష్టపోవడం తప్పడం లేదు.

నకిలీలతో మోసం..

ఖరీఫ్‌లో ఎంటీయూ 1318, 7029 రకాల వరిసాగును రైతులు చేస్తుంటారు. ఆరుగాల శ్రమించే రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు ఇబ్బందిగా మారాయి. గతంలో నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం మండలాల్లో నకలీ విత్తనాల వల్ల సుమారు 200 మంది కౌలు రైతులు అప్పుల పాలయ్యారు. దీంతో పాటు ఎరువులు, పురుగు మందుల షాపుల్లో నకిలీలు ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని రైతులు అంటున్నారు. వ్యవసాయాధికారులు మొక్కుబడిగా తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

భారీగా పెరిగిన కూలీ రేట్లు..

ప్రతి ఏడాదికి కూలీ రేట్లు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఆడవారికి రూ.200 కూలీ రేటు ఉంటే ఇప్పుడు రూ.300 ఉంది. గతంలో మగవారికి రూ.300 ఉంటే ఇప్పుడు రూ.500 వరకు పెరిగింది. ఇంత రేటు ఇచ్చినా కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా ప్రతీ ఎకరాకు ఎరువులు, అన్ని రకాల ఖర్చులు, కలుపుకొని మొత్తంగా సాగు ఖర్చు 38,850 అవుతుందని రైతులు చెబుతున్నారు.

రైతులకు మిగిలేది శూన్యం

ఖరీఫ్‌లో రైతులకు ఇక మిగిలిందేమీ ఉండటం లేదు. తొలకరిలో వాతావరణం అనుకూలించి, తెగుళ్లు రాకుండా ఉంటే ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. అయితే ప్రభుత్వం అందించిన గిట్టుబాటు ధర ప్రకారం రూ.35 వేలు వస్తుంది. కైలు రైతులు రైతులకు శిస్తు చెల్లించగా పోను కౌలు రైతులకు తొలకరిలో మిగిలేది లేక పోగా అప్పుల పాలవుతున్నారు. దీంతో ఖరీఫ్ సాగు చేయడం కన్నా మిన్నకుండడమే మేలని రైతులు భావిస్తున్నారు. కమిటీల నివేదిక ప్రకారం వ్యవసాయాన్ని వ్యాపారంగా గుర్తించి 75 కేజీల బస్తాకు రూ.2200 దాటి ధర కల్పిస్తేనే కాని రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండదని రైతుల అంటున్నారు.

ఏటా ఖర్చులు పెరుగుతున్నాయి



వరి సాగులో ఏటా ఖర్చులు పెరుగుతున్నాయి. సాగు చేస్తున్న ఖర్చులకు అనుగుణంగా పండించిన పంటకు ధర రావటం లేదు. దీంతో ఏటా ఖరీఫ్‌లో రైతులకు మిగిలేది ఉండటం లేదు.

– గుణ్ణం రామకృష్ణ, రైతు. కొత్తూరు

గిట్టుబాటు ధర పెంచాలి



వివిధ కమిటీలు చేస్తున్న సిఫారసులకు అనుగుణంగా వరికి గిట్టుబాటు ధరను కల్పించాలి. సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వాలు ఎన్ని రకాలుగా రైతులకు డబ్బులు వేస్తున్న ఫలితం ఉండటం లేదు. వ్యవసాయాన్ని వ్యాపారంగా గుర్తించి ధరను పెంచితే రైతులకు లాభం చేకూరుతుంది.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



తాతపూడిలో గ్రాడ్యుయేషన్ పొందిన చిన్నారులతో ర్యాలీ చేస్తున్న సీడీపీఓ తదితరులు

కపిలేశ్వరపురం: స్థానిక సెక్టార్ పరిధిలోని తాతపూడి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం. గజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రీయ పద్ధతిలో ఆరోగ్య ప్రమాణాలతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కార్యకలాపాలను వివరించారు. గ్రామంలో మానవ హారాన్ని నిర్వహించారు. ఐదేళ్ల వయసు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీలోని చిన్నారులను గ్రామ పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందామని ఎవరూ కలత చెందవద్దని ప్రజా తీర్పును మనం గౌరవించాలని రాబోయే కాలంలో నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యలయం వద్ద ప్రసన్న విఘ్నేశ్వరా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రామచంద్రపురం అర్బన్, రూరల్‌కు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సూర్యప్రకాశ్ సమావేశం నిర్వహించారు. పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, కౌన్సిలర్లు పెంటపాటి శ్రీను, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు సమావేశంలో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అందుకోసమే ఇటీవల జరిగిన ఎన్నికల్లో 40 శాతం మంది ఓట్లు వేశారన్నారు. పార్టీ కోసం పాటు పడిన వారందరినీ మనం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ నేతల వల్ల గానీ, మరి ఏ ఇతర ఇబ్బందులు కార్యకర్తలకు ఎదురైనా సమష్టిగా ఎదుర్కొందామన్నారు. రాబోయే కాలంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు అందరూ కలసి కట్టుగా పని చేద్దామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, ఎస్సీ సెల్ నాయకుడు పెట్టా శ్రీనివాసరావు, వాసంశెట్టి శ్యామ్, పటాన్ల గణపతి, కట్టా సూర్యనారాయణ, అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి మురళి, సత్తి శంకరరెడ్డి, గంటా దుర్గారామ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖర్జీకి బీజేపీ నివాళి



ముఖర్జీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాలు వద్ద శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పర్యావరణ హితం కోరుతూ మొక్కలు నాటారు. కార్యక్రమలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, నాళం ఫణిప్రకాష్, సీహెచ్ భాస్కరరాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఆదర్శనీయం

కె.గంగవరం: జనసంఘ్ అధినేత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఆదర్శనీయమని బీజేపీ మండల అధ్యక్షులు అవసరాల రమణమూర్తి అన్నారు. మండలంలోని యండగండి, పామర్రు, అముజూరు, సత్యవాడ, కె.గంగవరం గ్రామాల్లో ఆదివారం బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. రమణమూర్తి మాట్లాడుతూ ముఖర్జీ జనసంఘ్ పార్టీని స్థాపించి దేశమంతా పర్యటించి కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమైనప్పుడు కాశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక జెండా, ఆర్టికల్ 370ను రద్దు చేయాలని ఉద్యమించారన్నారు. దీంతో పాటు ఆయన తన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. ఆయన జూన్ 23న మరణించారని ఆ రోజును బలిదాన్ దివస్‌గా ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ సలాది శేఖర్, బల్లెం వెంకటస్వామి, సలాది రామకృష్ణ, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, మండల ఓబీసీ అధ్యక్షుడు కె.చందు, వి.గోవింద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అముజూరులో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిలక్ మాస్టారి సేవలు ఎనలేనివి



తిలక్‌బాబు, మెహర్ సుజాత దంపతులను సత్కరిస్తున్న విద్యావేత్తలు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా తెలగాని వీవీ సత్యనారాయణస్వామి తిలక్ బాబు(తిలక్ మాస్టారు) ఎనలేని సేవలందిచారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు తిలక్ మాస్టారు ఉద్యోగ విరమణ సత్కార సభ మాధవానంద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గోపీనాథ్ తదితరులు మాట్లాడుతూ కృషి, పట్టుదల, సేవ తిలక్ మాస్టారికి ఎనలేని గుర్తింపు తెచ్చి పెట్టాయన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా అనేక పదవులు చేపట్టి ఉపాధ్యాయ లోకానికి ఎంతగానో సేవలందించారన్నారు. సుదీర్ఘ కాలం పాటు మండల లిటరసీ అధికారిగా సేవలందించారన్నారు. అనంతరం తిలక్‌బాబు, మెహర్ సుజాత దంపతులను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, నాగిరెడ్డి సతీష్‌రావు, పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై రాముకు అభినందనలు



సఖినేటిపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సై రామును సత్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

సఖినేటిపల్లి: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సై ఎస్.రాముకు, విద్యార్థి సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం ఈ మేరకు స్టేషన్‌లో ఎస్సై రామును శాలువాతో విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అంకిత భావంతో విధులు నిర్వహించి, ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి, భద్రతలను పర్యవేక్షించారని గణేష్ అన్నారు. చొప్పల రామకృష్ణ, కె.సురేష్, పోలిశెట్టి గంగ, యెనుముల సతీష్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు

కొత్తపేట: వాసవీ క్లబ్ ద్వారా పేదలు, అంధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ మండపంలో డాన్ టు డస్క్ (ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలు) నిర్వహించారు. సభకు స్థానిక వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ఎస్‌యూకే లింగేశ్వరరావు అధ్యక్షత వహించగా వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్, క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ సురేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. స్థానిక వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. సేవాదృక్పదం గల ఆర్యవైశ్యులు మరింత మంది క్లబ్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం 5 గురు అంధులకు బ్లైండ్ స్టిక్స్, 20 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్స్, ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు మాస్కులు, టవల్స్, గొడుగులు, వాసవీమాత ఆలయానికి స్టూల్స్ పంపిణీ చేశారు. పలువురిచే నేత్ర, అవయవదాన పత్రాలు పూర్తి చేయించారు. కొత్తగా 10 మందిని క్లబ్ సభ్యులుగా చేరగా వారిచే క్లబ్ నియమ నిబంధనలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండలంలోని వాడపాలెం ఆర్యవైశ్య సంఘ భవనంలో నెలకొల్పేందుకు ఆలిండియా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రెసిడెంట్ కాళ్లకూరి నాగబాబు సమర్పించిన గాంధీ విగ్రహాన్ని ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో క్లబ్ డిస్ట్రిక్ట్ సభ్యులు రాజా నాగరత్నకుమార్, డాక్టర్ పచ్చిపులుసు కృష్ణారావు, కొత్తపేట క్లబ్ సెక్రటరీ కొత్త ఎస్ఎస్ బంగారు రామారావు, కొత్త జగన్నాథరావు, వాడపాలెం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు, సెక్రటరీ పచ్చిపులుసు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు పలువురి విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శింగంశెట్టి పుల్లేశ్వరస్వామి, గంగాభవాని దంపతులు రూ.11,131 విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన బుర్ల రమేష్, శాంతికుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈవో గ్రంధి మాధవి తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తొండవరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం


అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్ కాలనీలో విద్యుత్ స్తంభం శిథిలస్థితికి చేరి విరిగిపోయి ప్రమాద భరితంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభం బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే ఉన్న చెట్టుపై ఆధారపడి పడిపోకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు విద్యుత్ స్తంభం కూలిపోతుందో.. ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికుడు పి.రాజు అనేక సార్లు కాల్ సెంటర్‌కు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలస్థితికి చేరిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా చింతాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ దేవత చింతాలమ్మ జాతర శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

అతిసారం.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

- తాగునీటి కలుషితం వల్ల వ్యాధి వ్యాప్తి
- చేతుల శుభ్రత, పరిసరాల శుభ్రత తప్పనిసరి
- వర్షాలకు కేసులు అధికమయ్యే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పంటున్న వైద్యులు



రామచంద్రపురం రూరల్: వేసవి కాలం వెళ్తూ.. వర్షాకాలం వస్తుందంటూనే వ్యాపించే వ్యాధుల్లో అతిసార (డయేరియా) ముఖ్యమైంది. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం అందించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాపిస్తుంది. ఇక అపరిశుభ్రత కారణంగా డయేరియా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది.

అతిసార వ్యాధి లక్షణాలు..

విరేచనాలు నీళ్లలాగా పలుచగా అవుతుందంటే డయేరియా అని అర్థం. వైద్య పరిభాషలో దీన్ని గ్యాస్ట్రో ఎంటరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణ వ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల అవుతాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

వ్యాధి లక్షణాలు..

జీర్ణ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరేచనాలు అవుతాయి. విరేచనాలు పలుచగా కావడం, కడుపులో మెలి పెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగేనీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు నాడి తెలియపోవడం జరుగుతుంది. నీరసం, నోరు, నాలుక పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం జరుగుతుంది. వయసుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువగా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

నివారణ ఇలా..

చేతులు శుభ్రత పాటించాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. బయట ప్రాంతాల్లో ఆహారం తినడం మంచిది కాదు. ఉడకని మాంసం తినకూడదు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సొంత వైద్యం వద్దు, నిర్లక్ష్యం అసలే వద్దు..



డయేరియాకు గురైనప్పుడు విరేచనాలే కదా ఏం కాదులే అనే నిర్లక్ష్యం అసలే వద్దు. అదే విధంగా వ్యాధి బారిన పడినప్పుడు సొంతం వైద్యం చేసుకుని అశ్రద్ధ చేయకుండా వైద్యులను వెంటనే సంప్రదించాలి. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. కలుషిత ఆహారం, తాగునీటి కలుషితం, అపరిశుభ్రతల కారణంగా అతిసార (డయేరియా)కు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఆ జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో తాగునీటిని కాచి చల్లార్చి తాగాలి.

– ఎస్.ప్రశాంతి, డివిజన్ వైద్యాధికారి, రామచంద్రపురం